3673
శ్రీకాకుళం

# అల్లో నేరేడు

ఎబ్బే! ఇప్పటి పట్నం మునుపటి పల్లెకాదు.

మునుపటి పల్లె ఆనవాలే ఇప్పుడు లేదు.

పాడూరు లేదు – కూలిపోయి పునాదులు మిగిలిన గుళ్లు లేవు, గోపురాలు లేవు! ఎంతలోతు తవ్వినా నిధులు లేవు, నిక్షేపాలు లేవు! ఆ పరగణా హోల్ మొత్తంమీద, అప్పుడు రాలిన గింజన్నా మొక్క మొలవలేదు. అప్పటికి మొలిచిన మొక్కన్నా మానుకట్టలేదు. ఆనాటికి నిలిచిన మానన్నా, ఒక్క బోదెన్నా, సత్యానికి నిలువలేదు. సంజెదీపం వేళకు కళగాఉన్న పల్లె, మల్లీ చుక్కపొడిచే వేళకల్లా, ఒక్క మొయిని సురేసుకు పోయినట్టు పోయింది.

ఏమైపోయిందంటారు?

ఎండకన్నెరుగని ఆడకూతురు అయినవారింట పుట్టి అబ్బనాకారంగా పెరిగి, ఆ యింటఅడుగు పసుపు పారాణితో, పాపిటబొట్టుతో, చెంపన చుక్కతో, సిరులబ్బే చూపుతో యీ యింట పెట్టిన ఆడకూతురు చేయరాని పాపం చేయకపోయినా మోయరాని నింద మోసింది. అయ్యో పాపం! అన్నవారు లేకపోయిరి. కుయ్యో అన్నా గోడు ఆలకించేవారే కరువైపోయిరి. ఆ బిడ్డ ఎంత హడలిందని! ఆ తల్లి బ్రతుకు ఒక్క చిటికెలో చీకటిగుయ్యారమై పోగా ఎంత కుమిలిందని ?

ఒక్కకన్ను మూసింది. ఒక్కకన్ను తెరిచింది. ఎందుకు యిచ్చావమ్మా యీ పుటక ? అంటూ కన్నతల్లి మీద గావురుమంది. కానరాని తల్లికి మొక్కుతూ గావురుమంది. తెరిచిన కన్ను నిప్పులు చెరిగింది. మూసిన కన్ను ఒక్క ముత్తెం విడిచింది.

ఆ రవంత ముత్తెం సముద్రమంత అయింది. సముద్రం-సముద్రం ఏడుసముద్రాలంత అయింది. ఏడు సముద్రాలు ఏక ఉప్పెనైంది.

ఉప్పెనొచ్చి ఊరు ముంచెత్తింది; పోటొచ్చి పల్లెపల్లె నేలమట్టం చేసింది. ఆటొచ్చి, ఆ చీపరపాపర అంతా తుడిచిపెట్టింది.

తుడిచి పెట్టినంత మేరా - వానదేవుడొచ్చి, కల్లాపి జల్లాడు. గాలిదేవుడొచ్చి తడి ఆరబెట్టాడు. సూర్యభగవాన్లు అప్పుడు తెరపిచేసుకుని వచ్చి, భూమ్మీద ముగ్గులల్లే నెరియ

విచ్చాడు. అంతే, ఆ పొద్దు మొదలాయె ఆ గడ్డమీద ప్రాణాడదు; ఆ నింగిమీద పిట్టాడదు!

సరేనయ్యా - మరి, ఆ ఆడకూతురు కొచ్చిన నిందేమిటంటారు!

ఆడకూతురికి రారాని నింద!

అయిన యిల్లాలికి కలలో అన్నా రాకూడని నింద! కట్టుకున్న మారాజే తప్పుబట్టెనే - ఆ తల్లిని అంతమాటంటే పాపమనన్నా తలచక పోయెనే - ఒట్టూ సత్యాలూ నమ్మక పోయెనే - ఇంకేంజెయ్య నాతల్లి? ఇంకెవరితో మొరబెట్టుకొను ఆ అమ్మ!

సీతమ్మంటే సీతామ్మవారేనయ్యా! ఆ అయ్య రాముడంటివాడేనయ్యా! అయితేనేం, మూడు పువ్వులూ ఆరు కాయలూ కావల్సిన బతుకు మూణ్ణాళ్ళ ముచ్చట అయింది; ఆ కాపురం ఆరిపోయే దీపమల్లే ఒక్కసారి భగ్గుమంది.

సీతమ్మ సిరిగల యింటపుట్టింది. సంపదున్న యింటికి వచ్చింది! ఆబిడ్డ తెచ్చిన సారె పల్లెఅంతా ముమ్మారు పంచిపెట్టినా, ఎక్కీ-దక్కీ మిగిలింది. రామయ్య కుటుంబం అంటారా, పరగణా పరగణాకంతా మోతుబరీ అనుకోండి; వారికి ఏంతక్కువ? గీతొక్కటే తక్కువ; బ్రహ్మరాసిన రాతొక్కటే తక్కువ!

సీతమ్మ అల్లా వైభోగంగా సార్లెతో - చీర్లెతో తర్లి వచ్చింది; వెంటను, పట్టెమంచం వచ్చింది, పానుపొచ్చింది; రంగరంగ వైభోగాలొచ్చినాయ్.

తూర్పువేపు గదిలో పానుపేశారు; పడమటింట బంతులు బరి, విందులు చేసుకుంటున్నారు.

వచ్చిన చుట్టాలందరూ, జాజంబంతులు ఆడుకున్నారు.

మేజువాణీలు చేయించుకున్నారు.

తెల్లవారుజాముకి ఎక్కడవారక్కడ అలసిపోయినారు: చోటుచూసుకు సొమ్మసిల్లిపోయినారు.

సీతమ్మ అంతదాకా మేలుకుండలా! ఆ విద్దెలూ ఆ చోద్దాలూ ఆ తల్లికి నచ్చలా!

వచ్చే ఆవులింతను చిటికివేసి ఆవులించింది. అక్కడ నుంచి బద్ధకంగా లేచిపోయింది. బద్ధకంగా పోయిపోయి ఆ నిద్దురమత్తులో, అల్లాగే పక్కమీద చోటుచూచుకుని వాలిపోయింది. వాలినపళాన నిద్దరోయింది.

ఏ మూలనో కునుకుతీసిన రామయ్యకు కోడికూత వేళకు ఎవరో వెన్ను చరిచినట్టు మెళుకువ వచ్చింది. తానున్న వెంపు చూసుకున్నాడు, తన వెంపు చూసుకున్నాడు. ఒక్క ఒళ్ళువిరుపులో, పట్టెమంచం యాదకొచ్చింది, పండంటిపిల్లది యాదకొచ్చింది. లేచి నడింవాకిలికొచ్చాడు. చుక్కలమీదికి చూశాడు. ఇంకా జాము ప్రొద్దుందిగదా అనుకున్నాడు. ఉసూరుమన్న ప్రాణికి ఉత్సాహం వచ్చింది. ఒంటికి వేడొచ్చింది, చెంపకు ఒరచూపొచ్చింది. చివాల్న పోయినాడయ్యా, పానుపువేసిన గదిలోకి.

సీతమ్మ పొత్తకమల్లే ఒత్తిలి పడుకుంది, మాంచి నిద్దర్లోవుంది. అట్టె పరకాయించాడు. అడుగులో అడుగేసు

కుంటూ చెంపమీద చిటికేశాడు. చిటికేసినంత చిరునవ్వు నవ్వాడు. అంతే ప్రాపతం ఆ యింటికి.

చిటికెలోనే మేలుకుంది సీతమ్మతల్లి. చిరునవ్వుకు నాగసారంవిన్న ఆడత్రాచైంది. పంచప్రాణాల్తోనూ మిడిసిపడి ఆ మెడ కావిలేసుకుంది. ఏమో కులికింది. ఏమో గునిసింది. ముచ్చటాడేపాణెం నేరనిచిన్నది మూగవోయింది. అయితేనేం గడియలతరబడి వేగిన వేగూ - సోగిన సోగూ, కనుపాప విప్పిచెప్పింది.

చెప్పిందయ్యా చిన్నదాని కనుపాప. ఆకళింపయిందయ్యా, చినవాడికి. చిలకముక్కుకు దొండపండందినట్టు, జీరుగోరికి చివురాకు అందినట్టు సుఖపడేవాడే!- సుఖపెట్టేవాడే-కాని, చిన్నది ఆ నోము నోచలేదు. చినవాడికి ఆ అదృష్టం పట్టలేదు. తొలిముచ్చటకు కలకట్టుగా, సొక్కిసోలుతూన్న చిన్నది - అటువాలేదల్లా చటుక్కుమని ఇటుకేసి బెదిరి, త్రుళ్ళిపడి కెవ్వున కేకవేసింది.

ఆ వేసిన కేకకు ముసుగుదన్ని ఒళ్లు తెలియని నిద్దర్లో ఉన్న ప్రాణి చింబోతల్లే ఎగిరి గంతేసింది. ఆ చింబోతు, చింబోతంటారా కాదుకాదు. రామయ్యతమ్ముడు కామయ్య. బంగారువంటి మనిషి, బంగారమంటి మనసు-భయమూ భక్తీ ఉన్న పడుచువాడు.

కెవ్వుమన్న కేకకు మెళకువవచ్చింది. అన్ననుచూశాడు, వదిన్ని చూశాడు. తానున్న పానుపు చూశాడు. అయ్యో రామా అని అంగలార్చి, అన్న పాదాలమీద పడిపోయినాడు.

ఆపురుమన్నాడు. ఎంత తప్పు -.తప్పని వాపోయి, తల నేల నేసి కొట్టుకున్నాడు. ఆఖరికి, - అన్నా! అన్నాడు: 'వదినె మనింటికొచ్చిన పండగలో ఒళ్లు మరచిపోయినా, అటునుంచి వస్తున్నా, అగరొత్తులు గుప్‌మన్నాయి. ఆగిపోయినా, గుమ్మం వారకొచ్చి తొంగిచూసినా, గుమగుమా అత్తరు దీపం వెలుగుతూంది. కన్నెదర పాలఘీగడల్లే పానుపు అగుపించింది. తడిమి చూసినా - తబ్బిబ్బైపోయినా, నడుం అదే వాలింది. ఒళ్లు అదే ఆదమరచింది. మగత మగతగానే పట్టు కుచ్చులాటి శాలవా పైకి లాక్కున్నా, ఒక్క కునుకు తీసి వేద్దామనుకున్నా - మరి ఒళ్ళు తెలియలా! నా మనవి. ఇంతేనన్నా!'

కామయ్యతల ఛెళ్లున తన్నాడు రామయ్య తండ్రి ఒళ్ళు తెలియని ఉగ్రంతో! మెడనరాలు ఫెటఫెట మెటికిలు విరిగినాయ్! అంత తాపూతిని, కామయ్య గుక్క తిప్పుకున్నాడు.

'పర్వతంలాగా పడుంటివే. కానరాలేదా తల్లి!' అన్నాడు.

వెక్కి వెక్కి వచ్చే దుఃఖం ఆపుకుంటూ, 'నా దైవం అనుకుంటినయ్యా! అలికిడైతే మెలుకువ వచ్చేనని పట్టెనిల కరచుకుని పండుకున్నానయ్యా!' అన్నది సీతమ్మ.

'విన్నావుగందా అన్నా' అన్నాడు లేనిసత్తువ తెచ్చుకుంటూ, కామయ్య. అనడమేమిటి, మళ్ళీ అన్న రామయ్య మరో తన్ను తన్నడమేమిటి! తన్నిన తన్నుకు, మెడనరాలు

మరిన్ని మెటికెలు విరిగినయ్. గుండెలు, నాభిదగ్గిరికి నుంగిపోయినాయి. పడగ విప్పిన తాచైనాడు కామయ్య. నిదుర లేచిన సింహమైనాడు కామయ్య. ఏనుగంత సత్తువొచ్చింది. పట్టిన గుప్పిటిపట్టు విదిలించుకున్నాడు. తూలే కాలు దుయ్య బట్టుకున్నాడు. చీమైపోయి, దోమైపోయి, అంటు న్నాడు గందా! 'అన్నా! నా మనవి ఆలకించవయ్యా!'

అన్న - రామయ్య ఏమాటా చెప్పడే - కాళ్ళావేళ్ళా బడి బతిమాలుకుంటోన్న తమ్ముణ్ణి కన్నెత్తి చూడడే!

పోయిపోయి ఏటిబడ్డున కూచున్నాడు. పైన గోడు గల్లే మబ్బుంది. సిగలో పువ్వల్లే సూర్యుడున్నాడు. వింజామ రల్లే గరుడపక్షి ఆడుతూంది.

అడుగులో అడుగేసుకుంటూ కామయ్యొచ్చాడు: అల్లంతదూరాన సీతమ్మొచ్చింది. వచ్చివచ్చి - మూనేసుకు పోయినారు. నోటిమాట రాక - పలుకరించలేక-

జామైంది, గడియైంది రామయ్య కదిలాడు. ఒక్క ఉదుటు కురికాడు. తమ్ముణ్ణి పట్టుకుని గాను గాడేశాడు.

జామపండల్లే విచ్చినగడ్డం చేతబుచ్చుకుని, కామయ్య నొష్టంతో అన్నకు మొక్కాడు.

"ఒంటెఊపరినవుంది ఈ పుటక!- ఒక్క ప్రాణమూ పుచ్చుకో అన్నా! ఉడుకుమీదున్నావ్! ఉగ్గాలమీదు న్నావ్ - ఈ పళాన నన్ను తెగెయ్యకపోతే నువ్వు బతికేట్టు లేవు" అని బతిమలాడాడయ్యా!-

"ఒంటి పాన్పుమీదుంటిరే - పిల్లమనసేయలా!"

"రామరామ!"

"చెయి మీదికిపోలా?-"

"చెయ లేని పున్నెం తవ్వి తల కెత్తుకున్నాడు బిడ్డ - తల్లొచ్చి - పక్కను పండుకుంది. అది అన్నెం అంటావా?"

"వదిన్ను కంట జూడలా!"

"ఒక్క రెప్ప-"

"వల్లమాలిన చక్కంది: ఒక్క రెప్పలోనే మనసు గుంజుకు నుంటుంది!- నీవు ఓ రెప్పను చూశావు! నేను వెయి పుటకలకని మనసిచ్చాను-నిన్ను చీల్చినా మచ్చపోతుందా?-" పసిపిల్లడల్లే బావురుమన్నాడు రామయ్య! అంతతో తమ్ముడు ఉగ్రుడై నాడు.

"తల్లివ యేభాగ్యం తాళికట్టి తెచ్చుకున్న వాడు దక్క నీయులా! పోనీలే అమ్మ. కన్నవారు పేరెట్టుకున్నందుకు, ఆ తల్లి కష్టాలే నీకూ వచ్చినాయా! మల్లెపూవల్లే మాయింటి కొచ్చావ్. సిగలో ముడుచుకోడం నేరకపాయె. కళ్లనద్దు కుంటున్నా తల్లీ. మా తప్పులుకాయద్దు - మా వంగసం నిలవద్దు. శిక్షించక జాలిదలచావో వేయిపుటకలు పుట్టి వెంటాడుతా -" ఒక్కబిగివిని యీమాటలనేసి సూరడికి మొక్కి రామయ్య తూరీగల్లే పోయి ఏటిలో కలిసిపోయినాడు.

'వాడురాకుండా వాడేపోయినాడు. యింటికివస్తే ఏలు కుంటా' నన్నడయ్యా! సీతమ్మ ఉలకలా. 'పల్లెకుపోతే తలెత్తుకు తిరగలేను - ఏం గందరగోళంగా ఉందో - ఎన్ని

కమామేషులు పుట్టినాయో - అన్నీ నరంలేని నాలుకలు -'.
సీతమ్మ పలకలా !

"కాపురం పాడుచేసుకుంటావా ?-" సీతమ్మ మరింత ఉగ్రంగా నవ్వింది. రామయ్య పాటేలల్లే రొప్పుకుంటూ పారిపోయినాడు. పల్లెలో కనబడ్డవాడల్లా పలుకరించాడు. కంటబడిన ఆడకూతురల్లా నిలవేసింది ! ఏమైంది సీతమ్మ ? ఏటొడ్డునుంది. తాను తెగించిందా నువ్వు విడిచావా ? దైవానికి తెలియాలి. ఊరుకు వంక తెచ్చింది ! కత్తులు లేచినాయ్, కటార్లు దూసినాయ్ - పల్లెపల్లే ఏటివారకు దండుకట్టింది.

అక్కడ సీతమ్మ తపసులో ఉంది. ధ్యానంలో ఉంది. దిగువనే కాడనో సందడాయె. రానురాను, మందొస్తున్న అలికిడాయె. ఓరచూపు చూసింది. ఒక్కకన్ను విచ్చుకుంది. పుట్టబోయే బిడ్డలు కేరుమన్నారు, తరించబోయేటి వాళ్లు తల్లీ అన్నారు. ఏదీ వినలా, ఆడపుటకైతే యింత అలుసా అనుకుంది. రామయ్యను తలుచుకుని, నాతండ్రే అనుకుంది. ఒక్కపుటక పుట్టావ్ నన్ను ఉద్ధరించావ్. మళ్ళీ జన్మలెత్తే పనిలేదు. పగదీరుస్తున్నా బయల్లో కలిసి...అంది.

తెరచినకన్ను నిప్పులు చెరిగింది.

అందుకు ఇదీ కథ -!